సాక్షి అనంతపురం

శుక్రవారం । 27 । జూన్ । 2025



టన్ను చీనీ రూ.32 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ఠంగా రూ.32 వేలు ప్రకారం ధర పలికాయి.



రైళ్లలో కొరవడిన భద్రత

రైళ్లలో భద్రత కొరవడింది. ఇటీవల చోరీలు పెరిగిపోయాయి. దొంగల స్వైర విహారంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.4°/23.6°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: గర్భస్థ పిండ లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా స్థాయి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు అనుమతి లేకుండా నడుపుతుంటే చట్టరీత్యా చర్యలకు ఆదేశిస్తామన్నారు. లింగ నిర్ధారణకు ప్రోత్సహించినా చర్యలు తప్పవన్నారు. ఆడ బిడ్డ ప్రాముఖ్యతతో పాటు చట్టాన్ని అతిక్రమిస్తే ఎదురయ్యే పరిణామాలపై ఏఎన్‌ఎం, ఆశాల ద్వారా గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణకు పాల్పడినట్లు తెలిస్తే కమాండ్ కంట్రోల్ 08554-228234కు ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ అనుపమ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

అలా ముగించేశారు!



1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంటీఎస్ టీచర్ల విషయంలో ప్రభుత్వం ఏమాత్రం తగ్గలేదు. 'తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్లు' అన్న చందంగా మొండివైఖరితో ముందుకెళ్లింది. ఫలితంగా తక్కువ వేతనంతో పని చేస్తున్న వీరందరూ జిల్లా సరిహద్దు మండలాలకు వెళ్లాల్సి వచ్చింది. మొత్తం మీద వారిగోడును ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా అలా ముగించేశారు. తొలిరోజు 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ పూర్తికాగా, రెండోరోజు గురువారం 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు పూర్తి చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఉంటుందంటూ ఉదయం అందరికీ మెసేజ్‌లు పెట్టారు. కౌన్సెలింగ్ ప్రారంభానికి ముందు ఖాళీల అంశంపై మాట్లాడే ప్రయత్నం చేసినా...డీఈఓ ప్రసాద్‌బాబు అంగీకరించలేదు. తన పరిధిలో లేని అంశం అని.. కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని తేల్చి చెప్పారు. ఇప్పటికీ ఎవరైనా కౌన్సెలింగ్‌కు అటెండ్ కామని చెబితే మాత్రం అలాంటి వారికి నేరుగా కమిషనర్ కార్యాలయం నుంచే స్కూళ్లు అలాట్ చేస్తారని, అవి ఎక్కడో స్థాయో కూడా తెలీదంటూ స్పష్టం చేశారు. ఇప్పటికే రెండుమార్లు కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేసినా ప్రభుత్వం కరుణించలేదని ఎంటీఎస్ టీచర్లు వాపోయారు. తక్కువ వేతనంతో పని చేస్తున్న తమపై ఇంత కక్షసాధింపుతో వ్యవహరించడం సరికాదని వాపోయారు. ఎట్టకేలకు అందరూ అంగీకరించడంతో మధ్యాహ్నం 3.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమైంది. అర్ధరాత్రి దాకా కొనసాగింది. 404 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ముందురోజు 190 మంది 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ పూర్తి చేశారు. నిబంధనల మేరకే ఉన్న ఖాళీలను చూపించామని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఏదిఏమైనా కౌన్సెలింగ్‌కు సహకరించి ప్రశాంతంగా జరిగేలా చేసిన ఎంటీఎస్ టీచర్లకు డీఈఓ కృతజ్ఞతలు తెలియజేశారు.

గంజాయి సాగు,రవాణా చేస్తే జిల్లా బహిష్కరణ : డీఐజీ



డీఐజీ షిమోషి

అనంతపురం: గంజాయి సాగు, వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాల సాగు, వినియోగం, అక్రమ రవాణా వంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిని జిల్లా నుంచి బహిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాల నియంత్రణలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడబోమని స్పష్టం చేశారు. గంజాయి పొగ రూపంలో తీసుకుంటే ఊపిరితిత్తుల సమస్యలు, దీర్ఘకాలంలో ప్రాణాప్రాయం తలెత్తుతుందన్నారు. డ్రగ్స్ రవాణాకు పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

అమ్మలపై అలసత్వం

బాలింతల పట్ల కూటమి ప్రభుత్వం అలసత్వ వైఖరి ప్రదర్శిస్తోంది. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన గురించి పట్టించుకోకపోవడంతో ఇప్పటికే పేద గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ప్రసవమయ్యాక అందించాల్సిన చేయూత గురించి కూడా చంద్రబాబు సర్కారు కనీస ఆలోచన చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం ద్వారా సాయమందించడంలో కూడా విఫలమవుతోంది. ఆస్పత్రుల్లో తగినంత మంది సిబ్బంది లేకపోవడంతో వివరాలు సరిగా నమోదు చేయక 'అమ్మల'కు కాసింత అండ కూడా లేకుండా పోతోంది.



బాలింతలకు కరువైన 'జేఎస్‌వై' భాగ్యం

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో చేకూరని లబ్ధి
- వేలమంది బాలింతలకు పైసా అందని వైనం
- 'అనంతపురం'లో 56 శాతం, 'శ్రీ సత్యసాయి' 64 శాతం మందే దరఖాస్తు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం జేఎస్‌వై (జననీ సురక్ష యోజన) ప్రవేశపెట్టింది. ఈ పథకం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో రాష్ట్రంలోనే అత్యంత ఘోరంగా అమలవుతున్నట్టు తేలింది. ఆస్పత్రిలో చేరిన గర్భిణి ప్రసవమై డిశ్చార్జ్ అయ్యేలోగా తల్లి వివరాలన్నీ యాప్‌లో నమోదు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలి. వివరాలన్నీ సరిగా పంపితే తల్లి ఖాతాలోకి రూ.1,500 వేస్తారు. కానీ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో కనీసం 55 శాతం మందికి కూడా ఈ పథకం వర్తించడం లేదంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అంచనా వేయొచ్చు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే శాపం..

అనంతపురంతో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలోనూ 'జేఎస్‌వై' పనితీరు దారుణంగా ఉంది. ఉదాహరణకు చిత్తూరు జిల్లాలో 84 శాతం మంది తల్లులకు 'జేఎస్‌వై' కింద సొమ్ము అందగా, అనంతపురం జిల్లాలో కేవలం 56 శాతం మందికి మాత్రమే అందింది. శ్రీ సత్యసాయి జిల్లాలో 64 శాతం మందికి మాత్రమే వర్తించింది. ప్రసవం జరిగిన ఆస్పత్రిలో దరఖాస్తు చేయకపోవడం వల్లే వేలాదిమంది బాలింతలు ఇలా తమకు వచ్చే కొద్దిపాటి సొమ్మునూ కోల్పోతున్నారు. ఆస్పత్రులకు గర్భిణి రాగానే వివరాలు సేకరించి ఎంఎస్ఎస్ (మాతా శిశు సురక్ష) వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. భర్త పేరు, ఆధార్, బ్యాంకు ఖాతా నంబర్లు అన్నీ పంపించాలి. కానీ ఈ వివరాలు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లోనూ అప్‌లోడ్ చేయడానికి సిబ్బంది లేరు. ఉన్నా చాలా చోట్ల వాళ్ల వివరాలు నమోదు చేయడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నమోదు లేకపోతే ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో అసలే కానరావడం లేదు. దీంతో వేలాది మంది బాలింతలకు లబ్ధి చేకూరడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 2024-25 సంవత్సరంలో 3 లక్షల మంది బాలింతలకు అందలేదు. అంటే ఒక్కొక్కరికి రూ.1,500 చొప్పున రూ.45 కోట్లు కోల్పోయారు. అంతేకాదు 'జేఎస్‌వై' సరిగా నమోదు కాకపోవడంతో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కింద రూ.6 వేలు కూడా చాలామంది కోల్పోతున్నారు. ఆస్పత్రి యాజమాన్యాల నిర్లక్ష్యంతో కేంద్రమిచ్చే నిధులకు పేద బాలింతలు నోచుకోవడం లేదు.

	అనంతపురం జిల్లాలో	శ్రీ సత్యసాయి జిల్లాలో
హెచ్ఎంఐఎస్‌లో నమోదైన ప్రసవాలు	11,753	5,280
ఎంఎస్ఎస్ (మాతా శిశు సురక్షలో నమోదు)	7,970	4,085
లబ్ధి పొందిన బాలింతల సంఖ్య	6,648	3,427
లబ్ధి పొందిన బాలింతల శాతం	56.56	64.91

ఏడీఏల బదిలీ జాబితా విడుదల

- అనంతపురం, హిందూపురం పెండింగ్

అనంతపురం అగ్రికల్చర్: బదిలీల ప్రక్రియలో భాగంగా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ల (ఏడీఏ) జాబితా ఎట్టకేలకు వెల్లడైంది. బదిలీల చివరి రోజైన ఈనెల 9న రాష్ట్ర వ్యాప్తంగా 133 మందితో జాబితా విడుదల చేశారు. అయితే వెనువెంటనే దాన్ని వెనక్కి తీసుకున్నారు. 17 రోజుల తర్వాత తాజాగా బుధవారం అర్ధరాత్రి రెండో సారి 110 మందితో జాబితా విడుదల చేశారు. అయితే, రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది పరిస్థితి తేలలేదు. గతంలో ఎన్నడూ ఇలాంటి దుస్థితి లేకపోవడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా బదిలీల ప్రక్రియ చేపట్టడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. పలుకుబడి, ప్రజాప్రతినిధుల సిఫారసులు, పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొదటి జాబితాలో 9 మంది ఏడీఏలను బదిలీ చేస్తూ జాబితా ఇచ్చారు. తాజాగా విడుదలైన జాబితాలో ఏడుగురు ఏడీఏలను బదిలీ చేశారు. అత్యంత కీలకమైన అనంతపురం డివిజన్‌తో పాటు హిందూపురం డివిజన్‌లకు ఏడీఏలను కేటాయించకపోవడం గమనార్హం.

బదిలీలు ఇలా...

ఎస్.సత్యనారాయణ కదిరి నుంచి ఉరవకొండకు, ఎం.చెంగలరాయుడు తాడిపత్రి నుంచి కర్నూలు జిల్లా ఆలూరు, బి.కృష్ణమీనన్ మడకశిర నుంచి పెనుకొండ, జే.సనావుల్లా పుట్టపర్తి డీఆర్‌సీ నుంచి కదిరి, ఎల్.లక్ష్మానాయక్ రాయదుర్గం నుంచి ధర్మవరం, ఎస్.పద్మజ ఉరవకొండ నుంచి రాయదుర్గం, ఎం.రవి అనంతపురం నుంచి తాడిపత్రికి బదిలీ అయ్యారు. అనంతపురం నుంచి రవి బదిలీ కాగా ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. హిందూపురంలో ఉన్న అల్తాఫ్ అలీఖాన్ ఎక్కడకు బదిలీ అయ్యారనే విషయం అనేది కూడా తేలలేదు. ధర్మవరం ఏడీఏ కృష్ణయ్యను కూడా ఎక్కడకు బదిలీ చేశారనేది తెలియాల్సి ఉంది. అనంతపురం ఏడీఏ స్థానానికి అల్తాఫ్ అలీఖాన్, కృష్ణయ్యల మధ్య పోటీ ఉన్నట్లు తెలుస్తోంది.

అంటకాగిన 'బాబు'ల్లో అంతర్మథనం!

'దుర్గం' రెవెన్యూ అధికారుల్లో గుబులు

- మీ- సేవ బాబుకు సహకరించిన పలువురు ఉద్యోగులు
- ఈ-స్టాంప్ కుంభకోణం బయటకు రావడంతో లోలోన అంతర్మథనం
- అధికారులను విచారించే పనిలో పోలీసులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కళ్యాణదుర్గం రెవెన్యూ అధికారుల్లో గుబులు మొదలైంది. మీ-సేవ బాబు అలియాస్ యర్రప్ప ఈ- స్టాంప్‌ల కుంభకోణం బయటకు రావడంతో అతనితో ఇన్నాళ్లు సన్నిహితంగా మెలిగిన ఉద్యోగులు లోలోన మదనపడుతున్నారు. గతంలో మీ-సేవ ద్వారా వివిధ రెవెన్యూ పత్రాలు సైతం బాబు జారీ చేశాడు. దీనికి తోడు ఆధార్ కేంద్రాన్ని కూడా నడిపాడు. అప్పట్లో ఫోర్జరీ వేలిముద్రలు, ఫేక్ ఐడీలతో పలు సర్వీసులు నడిపినట్లు తాజాగా పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ క్రమంలో కొందరు అధికారులు తమకు ఎలాంటి చిక్కులు వస్తాయోనని పలువురి వద్ద ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది.

చాలా రోజుల నుంచే బాగోతం

కళ్యాణదుర్గంలో మీ-సేవ కేంద్రాన్ని నడిపే క్రమంలో బాబు ముందుగా అధిక సర్వీసులు ఇస్తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకున్నాడు. అయితే అధికారుల అవసరాలను గుర్తించి వారికి చేదోడు వాదోడుగా ఉంటూ వచ్చాడు. ఒకానొక సమయంలో మీ-సేవ ద్వారా అందించే రెవెన్యూ సర్వీసుల్లో గోల్‌మాల్ జరిగినట్లు గతంలో అధికారులు సైతం తనిఖీలు చేపట్టారు. అప్పట్లోనే కళ్యాణదుర్గంలో పనిచేసిన పలువురు తహసీల్దార్లకు చెందిన సీళ్లు, రబ్బరు స్టాంప్‌లు, రబ్బర్ వేలిముద్రలు గుర్తించి సీజ్ చేశారు. ఈ తతంగానికి సహకరించిన పలువురు ఉద్యోగుల కార్యాలయాలకు ప్రింటర్లు సైతం వితరణ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీ-సేవ కేంద్రం ద్వారా నకిలీ జనన, మరణ ధృవీకరణ పత్రాలతో పాటు 1బీ, అడంగల్ పత్రాలను సైతం ఫోర్జరీ చేసి పలు బ్యాంకులకు రుణాల నిమిత్తం అందించినట్లు పోలీసుల విచారణలో బయట పడినట్లు సమాచారం. ఆ దిశగా పోలీసులు మీ-సేవా కేంద్రంలో జరిపిన ఆర్థిక లావాదేవీలతో పాటు వివిధ కార్యాలయాలకు అందించిన ధ్రువీకరణ పత్రాలపై విచారణ చేస్తున్నట్లు తెలిసింది. దీంతో కళ్యాణదుర్గంలోని రెవెన్యూ, మున్సిపల్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మీ-సేవ బాబుతో సన్నిహితంగా ఉన్న ఉద్యోగులకు గుబులు పుట్టుకుంది.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభోత్సవం

- మాజీ మంత్రి సాకే శైలజానాథ్



ఏర్పాట్లపై నాయకులతో చర్చిస్తున్న శైలజానాథ్

శింగనమల: బుక్కరాయసముద్రంలో శుక్రవారం శింగనమల నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు మాజీ మంత్రి, పార్టీ సమన్వయకర్త సాకే శైలజానాథ్ తెలిపారు. గురువారం బుక్కరాయసముద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, అనంతపురం, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు నరేష్‌కుమార్ రెడ్డి, రమేష్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్, పార్టీ ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అనుబంధ విభాగాల నాయకులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ భాస్కర్, మండల కన్వీనర్ నరేష్, నాయకులు పూల నారాయణస్వామి, నందినేని మల్లికార్జున, పెద్ద వెంకటరెడ్డి, బోనా నాగలింగారెడ్డి, ముత్యాల శ్రీనివాసులు, పెద్ద కొండయ్య,పురుషోత్తం, ముసలన్న, ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాబుతో ఎంత నష్టం జరిగిందో వివరిస్తాం



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కార్పొరేషన్: ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోను ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయిలో ప్రజలకు గుర్తు చేసే కార్యక్రమాన్ని శుక్రవారం బీకేఎస్‌లో లాంఛనంగా చేపట్టనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. బీకేఎస్‌లో ప్రారంభించనున్న శింగనమల వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర స్థాయి నేతలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో ఏ కుటుంబానికి ఎంత నష్టం జరిగిందో ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టాలి. ఈ విషయంలో సంబంధిత అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి. బాల్యవివాహాలు జరిపించేవారితో పాటు ప్రోత్సహించే వారిపై కూడా కేసులు నమోదు చేయండి' అని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే దుష్ప్రభావాలపై స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో మండల, గ్రామస్థాయి, విద్యాసంస్థల్లో బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. బాలికలు కనపడడం లేదంటూ ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారితో సున్నితంగా మాట్లాడాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో బాలికలను ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లలో భాగస్వాముల్ని చేయాలన్నారు. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఖాతాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ నాగమణి, జెడ్పీ సీఈఓ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంఎఫ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా మినరల్ ఫండ్స్(డీఎంఎఫ్)తో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మినీ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ మినరల్ ఫండ్స్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024-25లో 116 పనులకు రూ.11.72 కోట్లు మంజూరు చేస్తే ఇప్పటి వరకు 10 పనులు మాత్రమే పూర్తి చేశారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. అత్యధిక ప్రాధాన్యత కింద రూ.4 కోట్లతో 27 పనులకు ప్రతిపాదనలు వచ్చాయని, చెక్‌లిస్ట్ ప్రకారం నివేదికలను ఆయా శాఖలకు అధికారులు అందజేయాలని చెప్పారు. ఇప్పటికే మంజూరై మొదలు పెట్టని పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాటిని చేపట్టాలా వద్దా అనేదానిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

పీఏబీఆర్‌లో రెండు నెలలు చేపల వేట నిషేధం

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్, బెళుగుప్ప మండలంలోని జీడిపల్లి జలాశయాల్లో జూలై, ఆగస్టు నెలల్లో చేపల వేటను నిషేధించినట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పెద్దబాబు నాయక్ తెలిపారు. ఈ రెండు నెలల్లో చేపలు సంతానోత్పత్తి ప్రక్రియలో పాల్గొంటాయన్నారు. ఈ క్రమంలో మత్స్యకారులు చేపలు పడితే ఆటంకం కలుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని మత్స్యకారులు గమనించాలని, నిబంధనలు అతిక్రమించి చేపలు పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

లుక్ పేరుతో బుక్ చేసేశారు!

- రూ.వందల కోట్లు డిపాజిట్ చేయించుకుని మోసం చేసిన వైనం
- రూ.2.50 లక్షలు చెల్లిస్తే రోజూ రూ.16 వేల ఆదాయం అంటూ గాలం
- అపరిమితంగా ఖాతాదారులను పెంచుకుని బురిడీ



అనంతపురం: రూ.2.50 లక్షలు చెల్లిస్తే రోజూ రూ.16 వేల ఆదాయం వస్తుందని నమ్మించారు. రూ.20,300 చెల్లిస్తే.. నిత్యం రూ.700 ఆదాయం వస్తుందని గాలం వేశారు. చివరికి రూ.కోట్లలో డిపాజిట్ చేయించుకుని బుక్ చేసేశారు. 'లుక్' పేరిట ఆన్‌లైన్‌లో సామన్యుల నుంచి అత్యున్నత స్థాయి వారిని ఆకర్షించి సొమ్ము డిపాజిట్ చేయించుకుని బోర్డు తిప్పేసిన ఓ ముఠా వ్యవహారమిది. వివరాలు.. అమెరికన్ కంపెనీ 'లుక్' పేరుతో ఆన్‌లైన్‌లో యాప్‌ను ప్రవేశపెట్టారు. పుస్తకాలు, గ్రంథాలు ఆన్‌లైన్‌లో చదివే 'లుక్' యాప్‌లో చందాదారుల పేరుతో దోపిడీ ప్రారంభించారు. రూ.2.50 లక్షలు చెల్లిస్తే రోజూ రూ.16 వేలు ఆదాయం వస్తుందని నమ్మించారు. ప్రతి బుధవారం నగదు డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించారు. రూ.20,300 చెల్లిస్తే.. రోజూ రూ.700 ఆదాయం వస్తుంది. ప్రతి రోజూ యాప్‌లో 25 టాస్క్‌లు ఉంటాయి. వీటిపై క్లిక్ చేస్తే ఒక్కో టాస్క్‌కు రూ.28 నగదు క్రెడిట్ అవుతుంది. ఇలా ప్రతి బుధవారం నగదు డ్రా చేసుకోవచ్చు. కొత్త ఖాతాదారులను చేర్పిస్తే 30 శాతం వెంటనే నగదు ఖాతాలోకి జమ అవుతుంది. ఇలా ప్రారంభంలో అత్యంత నమ్మకంగా, కచ్చితంగా మొత్తాలను చెల్లించారు. అనంతపురం నగరంలోనే రూ.20 వేల చందాదారులు వేలల్లో ఉన్నారు. రూ.2.50 లక్షల చందాదారులు వందల్లో ఉన్నారు. బుధవారం డ్రా చేసుకునేందుకు క్లిక్ చేయగా, తక్షణమే 30 శాతం చెల్లిస్తే.. ఈ 30 శాతం ఖాతాలో ఉన్న మొత్తం అంతా డ్రా చేసుకోవచ్చని యాప్‌లో మెసేజ్ చేశారు. దీంతో బుధవారం అర్ధరాత్రి 12 గంటల వరకు చాలామంది పోటీ పడి నగదు డిపాజిట్ చేశారు. అప్పులు చేసి మరీ చెల్లించారు. బుధవారం రాత్రి రూ.2.50 లక్షలు చెల్లించిన వారే అధికంగా ఉన్నారు. రూ.20 వేలు చెల్లించిన చందాదారులు తక్షణమే రూ.6,090 చెల్లించాలి. లేదంటే ఖాతా క్లోజ్ చేస్తామని హెచ్చరించారు. దీంతో ఉన్న ఫలంగా రూ.6,090 చెల్లించారు. ఇలా ఖాతాదారులకు అత్యాశ చూపించి బుధవారం రాత్రే అధికంగా మొత్తాలను కట్టించుకున్నారు. డబ్బు డ్రా చేయడంతో బ్యాంకు ప్రాసెస్‌లో ఉందంటూ గురువారం రాత్రి యాప్‌లో డేటాను తొలగించేశారు. దీంతో ఖాతాదారులు లబోదిబోమంటున్నారు. 'లుక్' పేరుతో కోట్లాది రూపాయలు దోచేశారని ఆందోళన చెందుతున్నారు. సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫోన్లు చేస్తున్నారు.

సైబర్ ముఠా పనేనా..?

ప్రజలకు ఆశ చూపి కోట్లాది రూపాయలు కొల్లగొట్టడం చూస్తే ఇది సైబర్ నిపుణుల పన్నాగమేనని భావిస్తున్నారు. 'లుక్'లో ప్రజలు తమ బ్యాంకు ఖాతాలను సైతం అప్‌లోడ్ చేశారు. ఈ క్రమంలో వ్యక్తిగత సమాచారాన్ని కూడా సేకరించి ఉంటారని, ఇలాంటి యాప్‌ల ద్వారా డబ్బు సంపాదిస్తే.. సదరు బ్యాంకు ఖాతాలను ఆయా మేనేజర్లు ఫ్రీజ్ చేస్తున్నట్లు తెలిసింది. సైబర్ క్రైం జరిగే అవకాశం ఉండడంతో మేనేజర్లు ముందస్తుగా ఫ్రీజ్ చేస్తున్నారు. ఇలాంటి యాప్‌ల ద్వారా ఆర్థిక లావాదేవీలు చేస్తే మరో వైపు బ్యాంకు రుణాలు ఇచ్చే అవకాశం ఉండదు.

క్లుప్తంగా

వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ


రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న కలెక్టర్

రాప్తాడురూరల్: 60 ఏళ్లు పైబడిన వారికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేపట్టాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి గ్రామంలో 60 ఏళ్లు నిండిన వృద్ధుల ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా ఆయన రేషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 30లోపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. విషయం మీకు తెలియజేశారా అంటూ వృద్ధురాలు నారాయణమ్మతో ఆరా తీశారు. బియ్యం నాణ్యత బాగుందా అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మోహన్‌కుమార్, రేషన్‌షాపు డీలర్ యమున, ఆర్ఐ సందీప్, వీఆర్ఓ రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

ప్రతి నెలా 26 నుంచి 30 వరకూ..

గార్లదిన్నె: ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ లోపు వృద్ధులు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని జేసీ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. గురువారం ఆయన గార్లదిన్నెలో పర్యటించారు. రేషన్ షాపు తనిఖీ చేశారు. అనంతరం జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. లోకాయుక్తకు సంబంధించి భూమి సమస్యపై విచారించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ ఈరమ్మ పాల్గొన్నారు.

రైళ్లల్లో కొరవడిన భద్రత

● రెచ్చిపోతున్న దోపిడీ దొంగలు ● ప్రయాణికుల సొమ్ముకు రక్షణ కరువు ● నిద్రావస్థలో రైల్వే పోలీసులు

గుంతకల్లు: రైలు ప్రయాణమంటనే ప్రయాణికులు హడలెత్తిపోయే రోజులు వచ్చాయి. ముఖ్యంగా దుండగులు అర్ధరాత్రి సమయాల్లో సిగ్నల్ కోసం వేచి చూస్తూ రైల్వేస్టేషన్ ఔటర్ ప్రాంతాల్లో నిలిపిన రైళ్లను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు తెరలేపడమే ఇందుకు కారణం. ఇంత జరుగుతున్న రైల్వే ఎస్కార్ట్, నిఘా వ్యవస్థలు నిద్రావస్థలో ఉండిపోయాయి. రైళ్లల్లో గస్తీ నిర్వహించే పోలీసులు ఏసీ బోగీల్లో నిద్రపోతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఇటీవల జరిగిన రైళ్లలో జరిగిన చోరీలు..

- ఈ ఏడాది ఏప్రిల్ 29న నిజాముద్దీన్-తిరుపతి మధ్య నడిచే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు గుత్తి జంక్షన్ సమీపంలో ఔటర్‌లో సిగ్నల్ ఇవ్వకపోవడంతో నిలిచిపోయింది. ఇదే అదనుగా భావించిన దుండగులు ముందస్తు పథకం ప్రకారం దాదాపు నాలుగు స్లీపర్ బోగీల్లోకి చొరబడి మారణాయుధలతో ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తూ 10 తులాలకు పైగా బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను అపహరించారు.
- మూడేళ్ల క్రితం వరుసగా హంపి, రాయలసీమ, చెన్నై ఎక్స్‌ప్రెస్ రైళ్లు అదే ఔటర్‌లో సిగ్నల్ కోసం నిలిపిన సమయంలో దుండగులు చొరబడి దాదాపు 30 తులాలకు పైగా విలువైన బంగారు ఆభరణాలను అపహరించారు.


సిగ్నల్ ఇవ్వకపోవడంతో గుంతకల్లు జంక్షన్ ఔటర్‌లో నిలిచిన కాచిగూడ-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు

- గుత్తి-అనంతపురం రైలు మార్గంలోని తురకపల్లి రైల్వేస్టేషన్, గుత్తి-తాడిపత్రి రైలు మార్గంలోని జక్కలచెరువు రైల్వేస్టేషన్ సమీపంలో సిగ్నల్ వైర్లను కట్ చేయడంతో రైలు ముందుకు పోవడానికి అవకాశం లేకుండా చేసి, ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణలు ఎత్తుకెళ్లారు.
- తాజాగా (గడిచిన సోమవారం వేకువజాము) తాడిపత్రి రైల్వేస్టేషన్ ఔటర్‌లో సిగ్నల్ వైర్లను కట్ చేసి కోమలి రైల్వేస్టేషన్ ఔటర్‌లో నిలిచిన ముంబై-చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికురాలు విశాలక్ష్మి మెడలోని 2.7 తులాల బంగారు గొలుసును లాక్కొని ఉడాయించారు.

అదే రోజు రాత్రి పాండిచ్చేరి-కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికురాలు దివ్యభారతి మెడలోని 3.5 తులాల బంగారు చైన్‌ను లాక్కొని ఉడాయించారు. గుత్తి రైల్వేస్టేషన్‌లో ఆగిన రైలు కిటికీ వద్ద కూర్చొన్న ఓ ప్రయాణికుడి చేతిలోని ఖరీదైన సెల్‌ఫోన్‌ను అపహరించారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధి 12 జిల్లాలకు విస్తరించి ఉంది. ఇందులో అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు. కడప, నంద్యాల, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీలతోపాటు కర్ణాటకలోని రాయచూర్, బళ్లారి జిల్లాలకూ గుంతకల్లు రైల్వే పోలీస్ కేంద్రంగా ఉంది. గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా 900 మంది పోలీసులు అవసరం కాగా, ప్రసుత్తం 550 మంది మాత్రమే ఉన్నారు. 350కి పైగా ఖాళీలు ఉన్నాయి.

డివిజన్ వ్యాప్తంగా రోజూ 300కు పైగా ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లలో 5 లక్షల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే గుంతకల్లు, గుత్తి రైల్వేజంక్షన్ల మీదుగా రాత్రి పూట దాదాపు 50కి పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు తిరుగాడుతున్నాయి. ఈ రైళ్లకు 20 నుంచి 24 బోగీలు ఉంటాయి. రాత్రి పూట తిరిగే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కేవలం ఇద్దరు కానిస్టేబుళ్లను మాత్రమే ఎస్కార్ట్‌గా కేటాయిస్తున్నారు. స్టాఫ్ తక్కువగా ఉండటంతో ఉన్న సిబ్బందితోనే 24 గంటలు విధులు నిర్వహిస్తుండటంతో విశ్రాంతి లేక జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్‌లు ఒత్తిడికి లోనువుతున్నారు.

ప్రయాణికుల రక్షణే ధ్యేయం

ప్రయాణికుల రక్షణే ధ్యేయంగా ఉన్న కొద్దిపాటి సిబ్బందితో ర్యాండమ్‌గా రైళ్లలో బందోబస్తు చేపడుతున్నాం. జీఆర్‌పీ సిబ్బంది ఇద్దరితో పాటు ఆర్‌పీఎఫ్‌కు చెందిన మరో కానిస్టేబుల్‌కు రైళ్లలో ఎస్కార్టు విధులు కేటాయిస్తున్నాం. సమస్యాత్మక రైలు మార్గాలపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలు సేకరిస్తున్నాం.

– హర్షిత, జీఆర్పీ ఇన్‌చార్జ్ డీఎస్పీ, గుంతకల్లు

అశాస్త్రీయ బదిలీల ప్రక్రియతో నష్టం

- సమస్యలకు పరిష్కారం చూపాలి
- కలెక్టరేట్‌లో గ్రామ సర్వేయర్ల నిరసన


కలెక్టరేట్ ఆవరణలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గ్రామ సర్వేయర్లు

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించకుండా చేపట్టనున్న అశాస్త్రీయ బదిలీల ప్రక్రియతో తీరని నష్టం వాటిల్లుతోందని గ్రామ సర్వేయర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీల ప్రక్రియలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ సర్వేయర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఆవరణలో సర్వేయర్లు ప్లకార్డులతో నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షుడు అరుణ్‌నాయక్ మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన కాకుండా రెవెన్యూ గ్రామ విస్తీర్ణం ప్రామాణికంగా తీసుకుని హేతుబద్ధీకరణ చేయాలన్నారు. హేతుబద్ధీకరణ చేస్తున్న సర్వేయర్లను వారి సమ్మతి మేరకే బదిలీల కౌన్సెలింగ్ చేపట్టాలన్నారు. ఉద్యోగుల అభిమతానికి అనుగుణంగా ఇతర శాఖలు కేటాయించాలన్నారు. పదోన్నతులు కల్పించిన తరువాత సీనియారిటీ ప్రాతిపదికన హేతుబద్ధీకరణ పూర్తి చేసి బదిలీలు చేయాలన్నారు. అడవులు, ముళ్లపొదల్లో వెళ్లి సర్వే చేసే తమకు రిస్క్ అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. సమస్యలను పరిష్కరించే వరకూ నిరసనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సునీల్‌కుమార్, దామోదర్, మల్లికార్జున, ప్రతాప్, జోత్స్న, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

పత్తి తూకంలో మోసం

బొమ్మనహాళ్: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో పత్తి తూకంలో మోసానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన పత్తి వ్యాపారులు మూడు రోజులుగా కృష్ణాపురం గ్రామంలో పత్తి కొనుగోళ్లు చేపట్టారు. గ్రామానికి చెందిన రైతులు తిప్పేస్వామి, వన్నూరుస్వామి, కొత్తపల్లి తిప్పయ్య, సుబ్బుతో పాటు మరికొందరు రైతులకు చెందిన పత్తిని గురవారం క్వింటా రూ.7,400 నుంచి రూ.7,800 వరకు కొనుగోలు చేశారు. కాటా వేస్తున్న సమయంలో మోసాలకు తెరలేపారు. దీంతో రైతు తిప్పేస్వామికి అనుమానం వచ్చి పరిశీలించగా క్వింటాకు 20 కేజీలు తేడా ఉన్నట్లు గుర్తించారు. దీంతో రైతులు చుట్టుముట్టి నిలదీయడంతో వ్యాపారులు అక్కడి నుంచి పారిపోయారు. దళారులు జోక్యం చేసుకొని గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లి 250 క్వింటాళ్ల పత్తికి నగదు కట్టించేలా చర్యలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న బొమ్మనహాళ్ పోలీసులు ఆ గ్రామానికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా రైతులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు.

నకిలీ బంగారంతో 'కీర్తన'కు టోకరా

- 9 మంది నిందితుల అరెస్ట్

నార్పల: మండల కేంద్రంలోని కీర్తన ప్రైవేట్ గోల్డ్ లోన్ బ్యాంకులో నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.లక్షల రుణం పొందిన మోసగాళ్లను నార్పల పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పట్టుపడిన వారిలో నార్పలకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్, దాదా పీర్, కంసాల మంజునాథ్, షేక్ మహబూబ్ బాషా, షేక్ అబ్దుల్ రజాక్, షేక్ సాదిక్ వలి, బాబు, షేక్ యూసుఫ్ బాషా ఉన్నారు. వీరు 125.8 గ్రాముల నకిలీ బంగారాన్ని కీర్తన ప్రైవేట్ గోల్డ్ లోన్ బ్యాంకులో తనఖా పెట్టి ఆ బ్యాంక్ అధికారి మహమ్మద్ షఫీతో కలిసి రూ.9.46 లక్షలు రుణం తీసుకున్నారు.

ఆడిట్‌లో బాగోతం బట్టబయలు

బ్యాంక్ క్లస్టర్ మేనేజర్ కొలంట్ల నాగరాజు ఇటీవల ఆడిటింగ్ చేపట్టగా తాకట్టు పెట్టిన బంగారం నకిలీదిగా నిర్ధారణ అయింది. దీంతో వెంటనే ఆయన నార్పల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసుల విచారణ కొనసాగుతుండగానే గురువారం మరోసారి అదే తరహాలో మోసం చేయడానికి నిందితులు ప్రయత్నించారు. విషయాన్ని గుర్తించిన మేనేజర్ అప్రమత్తం కావడంతో అక్కడి నుంచి ఉడాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చేపట్టి నార్పల క్రాస్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 10 నకిలీ బంగారు గాజులు, రెండు కడియాలు, మూడు ఉంగరాలు, ఓ ద్విచక్ర వాహనం, షిఫ్ట్ డిజైర్ కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, లోతైన దర్యాప్తు చేపట్టారు.


సచివాలయ ఉద్యోగులకు 'ఐడీ' తప్పనిసరి

- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం


సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్


అనంతపురం ఎడ్యుకేషన్: సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల విధులపై ఆరా తీశారు. ఐడీ కార్డులు ధరించని వారిపై క్రమశిక్షణ చర్యలుంటాయని హెచ్చరించారు. సచివాలయంలో నీరు రావడం లేదని వెంటనే చర్యలు తీసుకోవాలంటూ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ మోహన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: అనారోగ్యంతో మృతి చెందిన అనంతపురం డీటీసీ సీఐ పవన్‌కుమార్ మృతదేహానికి గురువారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసు శాఖలో 1996లో ఎస్ఐగా చేరారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బంధువులు, స్నేహితులు, అధికారులు, బ్యాచ్‌మేట్ల సందర్శనార్థం ఆయన మృతదేహాన్ని అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న స్వగ్రహంలో ఉంచారు. అనంతరం గురువారం పిల్లిగుండ్ల కాలనీ సమీపంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, సీఐలు దేవానంద్, శేఖర్, ఆర్ఐ పవన్ కుమార్, రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, ఆర్ఎస్ఐ జాఫర్, సూర్యకుమార్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారులు

అనంతపురం: మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా అనంతపురం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఫ్యాషన్ పేరుతో యువత గంజాయికి బానిసలుగా మారుతోందని, దీంతో తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల ప్రభావం గురించి వివరించారు. చట్టంలో విధించే శిక్షలపై అవగాహన కల్పించారు. మత్తుకు బానిసలు కావొద్దని పిలుపునిచ్చారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. తమకు తెలియకుండానే డ్రగ్స్ వలలో విద్యార్థులు చిక్కుకుంటున్నారని పేర్కొన్నారు. చెడు స్నేహాలతో మంచి విద్యార్థులు కూడా క్రమంగా వ్యవసనాల బారినపడుతున్నారన్నారు. డ్రగ్స్ వినియోగం నుంచి విక్రయదారులుగా మారుతుండడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, రేవతి, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సరితారెడ్డి పాల్గొన్నారు.

శ్రీసత్యసాయిజిల్లాలో వరుస హత్యలు

శ్రీసత్యసాయిజిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. భార్యపై అనుమానంతో ఓ యువకుడిని మరొకరితో కలసి రెండు రోజుల క్రితం భర్త మట్టుబెట్టగా గురువారం వెలుగు చూసింది. మరో ఘటనలో జిల్లా సరిహద్దున కర్ణాటక ప్రాంతంలో మద్యం మత్తులో చోటు చేసుకున్న గొడవలో హిందూపురం మండలానికి చెందిన ఓ యువకుడు హతమయ్యాడు.

- భార్యపై అనుమానంతో లేపాక్షి మండలంలో ఓ యువకుడి హత్య
- మంగళవారం రాత్రి వేటకొడవళ్లతో నరికి హతమార్చిన వైనం
- పోలీసుల అదుపులో నిందితులు
- జిల్లా సరిహద్దున కర్ణాటక పరిధిలో గురువారం తూముకుంట వాసి హత్య

అనుమానం పెనుభూతమై..


రవికుమార్ (ఫైల్)

లేపాక్షి: భార్యపై అనుమానంతో ఓ యువకుడిని వేటకొడవళ్లతో నరికి హత్య చేసిన ఘటన గురువారం లేపాక్షి మండలంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం మైదుగోళం గ్రామానికి చెందిన రవికుమార్ (37)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి అశ్వత్థప్పతో కలసి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో తన ఇంటికి సమీపంలో నివాసముంటున్న బంధువు ఆనంద్ కుటుంబంతో రవికుమార్ చనువుగా ఉండేవాడు. తరచూ ఇంటికి రాకపోకలు సాగిస్తుండడంతో తన భార్య ప్రవర్తనపై అనుమానాలు పెంచుకున్న ఆనంద్ ఎలాగైనా రవికుమార్‌ను హత్య చేయాలని భావించాడు. ఈ క్రమంలో తన సోదరుడు గోవిందప్పతో కలసి పథకం రచించాడు. ఇందులో భాగంగానే మంగళవారం రాత్రి స్థానిక రైతు లింగప్ప తోటలో మందు పార్టీ ఏర్పాటు చేసినట్లు తెలిపి రవికుమార్‌ను రప్పించుకున్నారు. ముగ్గురూ కలసి మద్యం సేవించారు. అదే సమయంలో మత్తులో జోగుతున్న రవికుమార్‌పై వేటకొడవలితో దాడి చేయడంతో మొండెం నుంచి తల వేరుపడింది. అనంతరం మృతదేహాన్ని నీటి గుంతలో గొయ్యి తీసి పాతిపెట్టారు. బుధవారం తెల్లవారినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో అశ్వత్థప్ప ఆరా తీయడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో ఆనంద్, గోవిందప్ప ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అసలు విషయం బయటపడడంతో నీటి గుంతలో పాతిపెట్టిన మృతదేహాన్ని గురువారం వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. ఘటనపై మరింత లోతైన విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

మద్యం మత్తులో...


హతుడు రవికుమార్

గౌరిబిదనూరు/హిందూపురం: మండల పరిధిలోని తూముకుంట చెక్‌పోస్టు ప్రాంతంలో నివాసముటున్న రవికుమార్ (37) జిల్లా సరిహద్దున కర్ణాటక పరిధిలో దారుణ హత్యకు గురయ్యాడు. వెల్డర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్న అతనికి భార్య అనుపమ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిస కావడంతో అతనిలో మార్పు తీసుకువచ్చేందుకు భార్య విశ్వ ప్రయత్నాలు చేసింది. అయినా మార్పు రాకపోవడంతో 4 ఏళ్ల క్రితం భర్తను వదిలేసి పిల్లలను పిలుచుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె రాలేదు. దీంతో ఒంటరిగా మారిన రవికుమార్ ఎప్పుడూ మద్యం మత్తులో జోగుతూ జులాయిగా తిరగసాగాడు. ఈ నేపథ్యంలో జిల్లా సరిహద్దున కర్ణాటక పరిధిలోని గంగోత్రి బార్ వద్దకు గురువారం వెళ్లిన అతను సాయంత్రం మద్యం మత్తులో జోగసాగాడు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న హిందూపురంలోని బాపూజీ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ అశోక్‌తో గొడవపడ్డాడు. ఆ సమయంలో ఇద్దరూ పరస్పరం కొట్టుకున్నారు. గొడవ తారస్థాయికి చేరుకోవడంతో ఆటో డ్రైవర్ బీరు బాటిల్ ముక్క తీసుకుని విచక్షణారహితంగా దాడి చేశాడు. వరుస పోట్లకు గురి కావడంతో రవికుమార్ అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. సమాచారం అందుకున్న కర్ణాటకలోని గౌరిబిదనూర్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీసీ ఫుటేజీలను సేకరించారు. ఘటనపై గౌరిబిదనూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు


ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: రైళ్లలో నిషేధిత పదార్థాల అక్రమ తరలింపులకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా స్థానిక రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫాంలతో పాటు వెటింగ్ హాళ్లు, పార్శిల్ కార్యాలయాన్ని స్నిఫ్పర్ డాగ్ సాయంతో తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను సేకరించారు. తనిఖీల్లో ఏఆర్ ఎస్ఐ బి.వెంకటరమణ, గౌస్‌మొద్దీన్, సిబ్బంది, స్నిఫ్పర్ డాగ్ స్క్వాడ్ పాల్గొన్నారు.

సమాధుల ధ్వంసం


ధ్వంసమైన సమాధులను పరిశీలిస్తున్న స్థానికులు

పెద్దవప్పూరు: మండలకేంద్రంలోని హిందూ శ్మశాన వాటికలో సమాధులను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న నేత కార్మికులతో కలసి నేత కార్మిక సంఘం నాయకులు చింతా పురుషోత్తం, నీలూరు రుషింగప్ప గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఒకే వంశానికి చెందిన 8 సమాధులను ధ్వంసం చేయడం కుట్ర పూరితమేనని పేర్కొన్నారు. సమాధులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'ఉద్యాన' పథకాలు వినియోగించుకోండి

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యానశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, రాయితీలు, ప్రోత్సాహకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని రెండు జిల్లాల ఉద్యానశాఖ డీడీలు డి.ఉమాదేవి, జి.చంద్రశేఖర్ తెలిపారు. కొత్త తోటల పెంపకంలో భాగంగా హెక్టారుకు మామిడి తోటలకు రెండు సంవత్సరాల్లో రూ.50 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. జామకు రూ.80 వేలు, చీనీ రూ.50 వేలు, దానిమ్మ రూ.50 వేలు, సీతాఫలం రూ.30 వేలు, సపోటా రూ.30 వేలు, రేగు రూ.30 వేలు, ద్రాక్ష రూ.1.20 లక్షలు, టిష్యూకల్చర్ అరటి రూ.70 వేలు, బొప్పాయి రూ.30 వేలు, డ్రాగన్ ఫ్రూట్ రూ.2.70 లక్షలు, అవకాడో రూ.50 వేలు, అంజూర రూ.50 వేలు, ప్యాషన్ ఫ్రూట్ రూ.2.75 లక్షలు, ఉసిరి రూ.75 వేలు, నేరేడు రూ.75 వేలు, చింత రూ.75 వేలు, ఫల్సాఫ్రూట్ రూ.75 వేలు, విడిపూల సాగుకు రూ.50 వేలు, హైబ్రీడ్ కూరగాయల సాగు రూ.60 వేల మేర రెండేళ్లలో రాయితీ వర్తిస్తుందని తెలిపారు. పుట్టగొడుగుల పెంపకానికి రూ.2 లక్షలు రాయితీ ఉంటుందన్నారు. 10 సంవత్సరాల పైబడి వయసున్న మామిడి, 8 సంవత్సరాల పైబడి కలిగిన చీనీ తోటలకు హెక్టారుకు రూ.24 వేలు రాయితీ ఇస్తామన్నారు. అలాగే సోలార్‌కోల్డ్ రూంలు, సోలార్ క్రాప్ డయ్యర్లు, కోల్డ్‌స్టోరేజీల్లో కండెన్సర్ల మార్పు, రిఫర్‌వాన్, ప్లాస్టిక్ క్రేట్స్‌కు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు, హెచ్‌ఓలు, ఉద్యానశాఖ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

మాదక ద్రవ్యాల నివారణకు సమష్టి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ (చిత్రంలో)ఎస్పీ జగదీష్

అనంతపురం: మాదక ద్రవ్యాల నివారణకు సమష్టి కృషి అవసరమని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినం సందర్భంగా గురువారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని యువతకు సూచించారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలను వినియోగించిన, అమ్మిన, నిల్వ ఉంచినా, అక్రమ రవాణా చేసినా పదేళ్ల జైలు శిక్ష విధిస్తారని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.రాజశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య


మృతుడు శరణప్ప

గుంతకల్లు టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ పార్సిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్క్‌లో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం సాయంత్రం అటుగా వెళ్లిన ప్రయాణికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకుని పరిశీలించారు. చొక్కా జేబులో లభ్యమైన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు కర్ణాటకలోని రాయచూర్ జిల్లా గుడెదనాల్‌కు చెందిన శరణప్ప(39)గా గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు.

పనస కాయల వాహనం బోల్తా


బోల్తా పడిన బొలెరో వాహనం

కనగానపల్లి: బెంగళూరు నుంచి అనంతపురానికి పనస కాయల లోడ్‌తో వెళుతున్న బొలెరో వాహనం కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై బోల్తాపడింది. గురువారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. మామిళ్ల పల్లి సమీపంలోని గ్లాస్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకోగానే వాహనం ముందరి టైర్లు రెండూ ఒక్కసారిగా పేలాయి. దీంతో రోడ్డుకు అడ్డంగా వాహనం బోల్తాపడింది. పనస కాయలన్నీ రోడ్డుపై చెల్లాచెదురయ్యాయి. ఘటనతో రూ.30 వేల మేర నష్టం వాటిల్లినట్లు అనంతపురానికి చెందిన వ్యాపారి పోతులయ్య వాపోయాడు. కాగా, ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

ఆర్టీసీని కాపాడుకుందాం

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీపై కక్ష సాధింపు చర్యలో భాగంగా నిధులు నిలుపుదల చేశారు. ఉద్యమాలు చేసి ఆర్డీటీని కాపాడుకుందామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి అన్నారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ.. ఎంతో మంది పేదలకు సహాయ సహకారాలు అందించిన ఆర్డీటీ ఇప్పుడు కష్టాల్లో ఉందని తెలిపారు. ఆర్డీటీకి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్డీటీని కాపాడుకునేందుకు కుల, ప్రజా సంఘాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యచరణ వేసి ఉద్యమాలు చేపట్టేందుకు ప్రత్యేక కమిటీ వేయాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఆనందరాజులు, చామలూరు రాజగోపాల్, ఓబులేసు, సుగమంచి శ్రీనివాసులు, చాబాల జగదీష్, మందల రమేష్, బుడగ జంగం ఆంజి, రామన్న, మారెన్న, వసంత కుమార్, రాజేష్, రామాంజనేయులు, మిద్దె ఓబులేసు, రాజు, రామకృష్ణ, సూర్యనారాయణ, నరేంద్ర, లాలెప్ప, అదాం, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో 15 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నగరపాలక సంస్థ నుంచి ర్యాలీ చేపట్టారు. సప్తగిరి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టెక్నికల్ సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 ఇవ్వాలన్నారు. పండుగలను సెలవు దినాలుగా ప్రకటించాలని కోరారు. లేని పక్షంలో వేతన దినాలుగా పరిగణించాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పదవీ విరమణ పరిమితి 62 సంవత్సరాలు చేయాలన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుడి కుటుంబ సభ్యుడికి రూ.10 లక్షలు, అంగవైకల్యానికి గురైతే రూ.5 లక్షలు చెల్లించాలని తెలిపారు. తమ సమస్యలు తీర్చే వరకు దశలవారీగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భాస్కర్ రెడ్డి, లోకేష్ నాయుడు, కుళ్లాయప్ప, జగదీష్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్, నీటి సరఫరా విభాగం కార్మికులు

'బ్రాహ్మణులను కించపరచడం తగదు'

అనంతపురం: మైత్రీ మూవీస్ నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్, దర్శకుడు ఫణీంద్ర నరిశెట్టి బ్రాహ్మణులను కించపరుస్తూ నిర్మించిన 8 వసంతాల సినిమాను నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘ్ ప్రతినిధులు ఎస్పీ జగదీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. బ్రాహ్మణుల మీద విషం కక్కుతూ కాశీ వంటి పుణ్యక్షేత్రంలో ఒక అర్చకుడు అమ్మాయిని ట్రాప్ చేసి రేప్ చేసినట్లు చిత్రీకరించడం దారుణమన్నారు. బ్రాహ్మణులు సమాజ హితం మాత్రమే కోరుకుంటారని అటువంటి జాతిని కించపరచడం తగదన్నారు. ఓటీటీలో కూడా విడుదల కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.



ఎస్పీ జగదీష్‌కు వినతపత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

మహిళలపై దాడులను అరికట్టాలి

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో మహిళలు, అమ్మాయిలకు రక్షణ కల్పించలేని అసమర్థ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎ.పద్మావతి ధ్వజమెత్తారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో సమాఖ్య అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల వరసగా నమోదవుతున్న యువత మిస్సింగ్ ఘటనలు ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టిస్తున్నాయన్నారు. ఇటీవల శ్రీనివాస నగర్‌కు చెందిన యువతి ఈనెల 20న మిస్సింగ్ కావడంపై కేసు నమోదైనట్లు తెలిపారు. పది రోజులుగా నగరంలోని ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ మిస్సింగ్ కేసులు నమోదు అవుతుండడం ప్రమాదకర పరిణామన్నారు. ఇంత జరుగుతున్న ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం బాధ్యతారహిత్యమన్నారు. మిస్సింగ్ కేసుల దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. మహిళలపై జరిగే దాడులు, ట్రాఫికింగ్ ముఠాలను నిరోధించే దిశగా ప్రభుత్వం, పోలీసు శాఖ పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు, అమ్మాయిల మిస్సింగ్ ఘటనలపై కలెక్టర్, ఎస్పీలను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య నగర అధ్యక్ష, కార్యదర్శులు యశోద, జానకి, నాయకురాళ్లు శారద, లక్ష్మీదేవి, ఆజాబి, సారంబీ, మమత, నాగమ్మ, లీలావతి, అరుణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి

'పంచాయతీకి ఆదాయం తీసుకొచ్చే బాధ్యత మీదే'

రాప్తాడు: గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మీ చేతుల్లోనే ఉంది. మీ ద్వారానే పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని డీపీఆర్సీ జిల్లా కో-ఆర్డినేటర్లు సౌజన్య కుమారి, మాధవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సాకే తిరుపాలు అధ్యక్షతన పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మట్లాడుతూ.. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరిసరాల అపరిశుభ్రంగా ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడతారన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. పంచాయతీ కార్మికులు వారికి కేటాయించిన ఇళ్లల్లో ప్రతి రోజూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. సేకరించిన చెత్త ద్వారా వర్మి కంపోస్ట్ ఎరువును తయారు చేసి రైతులకు సేంద్రియ ఎరువులు అందజేయాలని సూచించారు. ఈ ఎరువులను రైతులు వాడితే తమ పంటల్లో దిగుబడులు పెరుగుతాయని రైతులకు వివరించాలన్నారు. చెత్త సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించి, పంచాయతీని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, మాధవి, పంచాయతీ కార్యదర్శులు ప్రేమ్ కుమార్, వెంకట రమణ రెడ్డి, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఆర్సీ జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య కుమారి

సంక్షిప్త సమాచారం

బ్యాటరీ సైకిళ్ల పంపిణీ

అనంతపురం కల్చరల్: నగరంలోని సక్షం సేవా కేంద్రంలో 8 మంది దివ్యాంగులకు బ్యాటరీ సైకిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరెస్సెస్ సేవా భారతి ఆర్గనైజింగ్ సెక్రటరీ కేశవయ్య, డాక్టర్ కొండయ్య, సుంకు వేణుగోపాల్, మల్లికార్జున, ఇతర జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

పశుశాఖ కార్యాలయ మేనేజర్‌గా సౌజన్య

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ జేడీ కార్యాలయ మేనేజర్ (జీవోఎం)గా సౌజన్య గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న జి.మంజుల విశాఖపట్టణం జీవోగా బదిలీ కాగా.. అక్కడ పనిచేస్తున్న సౌజన్యను ఇక్కడకు బదిలీ చేశారు. స్థానిక పశుశాఖ జిల్లా కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్న నూతన జీవోఎంకు ఆ శాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, ఏడీలు డాక్టర్ రాధిక, డాక్టర్ కేఎల్ శ్రీలక్ష్మి, డాక్టర్ రవిబాబు, అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, రంగారెడ్డి ఇతర ఉద్యోగులు పుష్ప గుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

రాప్తాడు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దండు రామాంజనేయులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ముందు భీమ్ రావ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి మాజీ కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దండు రామాంజనేయులు, ఆయన సోదరుడు దండు శంకర్ రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో భీమ్ రామ్ యువజన సంఘం అధ్యక్షుడు కటిక జయరాం, వైస్ ప్రెసిడెంట్ బాల నాగేంద్ర, ట్రెజరర్ ఓబులేష్, సెక్రటరి నాగప్ప, నాయకులు ముత్యాలు, నాగప్ప, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా లేకపోతే చర్యలు

రాప్తాడు: మధ్యాహ్న భోజనం రుచిగా లేకపోతే చర్యలు తప్పవని ఎంఈఓ మల్లికార్జున హెచ్చరించారు. గురువారం ఆయన రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యతగా లేదని తమకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేకపోతే ఏజెన్సీ నిర్వాహకులు, ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పదో తరగతిలో 100 శాతం ఫలితాలు వచ్చేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వరి, పీడీ రాజశేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.

ఏసు మార్గం ఎంచుకోవాలి



చర్చి నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: ప్రతి ఒక్కరూ ఏసు మార్గాన్ని ఎంచుకోవాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి ఏసుకృపా మందిరంలో '5వ వార్షికోత్సవ సభ' జరిగింది. గార్లదిన్నెకు చెందిన పాస్టర్ కే లాజరస్ క్రీస్తు విశ్వాసుల సంఘానికి రూ. 20 వేలు, నగరంలోని పాస్టర్ చార్లెస్ నాయక్ బేతనియా ప్రేయర్ హౌస్ నిర్మాణానికి రూ. 25 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు,వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ పీ మార్కు, రెవ డాక్టర్ కె. స్టీవెన్ సురేష్, అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ పాస్టర్ వి.మనష్షే, బెంజిమెన్, కె. జీవన్ బాబు, జహంగీర్ జాషువా, కె.లాబాన్ సుధాకర్, పాస్టర్ విజయ్ సింహ, పాస్టర్ చార్లెస్ నాయక్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

అనంతపురం కల్చరల్: అనంత స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని మై భారత్ రాష్ట్ర డైరెక్టర్ అన్షుమాన్ ప్రసాద్‌దాసు అన్నారు. గురువారం నెహ్రూ యువకేంద్రం కార్యాలయానికి మై భారత్ రాష్ట్ర డైరెక్టర్ అన్షుమాన్ ప్రసాద్ దాసు విచ్చేశారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్టు తరఫున షేక్ చాందినిని అభినందించారు. సాయిట్రస్టు తరఫున నిర్వహిస్తున్న నారాయణ సేవ, మహాప్రస్థానం సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ట్రస్టు చైర్మన్ విజయ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం డీడీఓ శ్రీనివాసులు, కో-ఆర్డినేటర్ రాహుల్ గిరిరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలిగితే ఉజ్వల భవిష్యత్

ఆత్మకూరు/రాప్తాడు: ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, ఎస్ఐ లక్ష్మణరావు, తహసీల్దార్ లక్ష్మీనాయక్ పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు, రాప్తాడులో మత్తు పదార్థాలు, యాంటీ డ్రగ్స్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.

స్వామి సహజానంద సరస్వతికి నివాళి

అనంతపురం అర్బన్: స్వాతంత్ర సమరయోధుడు, అఖిల భారత కిసాన్ సభ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వామి సహజానంద సరస్వతి ఆశయాలను కొనసాగించాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సహజానంద సరస్వతి వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాము, రమేష్, రాకెట్లరాము, బాషాద, బాబు, తిరుపతయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.